క్లుప్తంగా

అక్రమ ఆక్వా సాగుదారులపై చర్యలకు డిమాండు

అమలాపురం టౌన్: జిల్లాలో అక్రమ ఆక్వా సాగు చేస్తున్న రైతుల వివరాలను బహిర్గతం చేయడంతో పాటు అందుకు పరోక్షంగా సహకరిస్తున్న వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల పైనా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా సీపీఐ కార్యదర్శి కె.సత్తిబాబు డిమాండ్ చేశారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న అక్రమ సాగుదారులు, వెనక ఉండి ప్రోత్సహిస్తున్న అధికారులపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకున్నప్పుడే ఈ విష సంస్కృతికి తెర పడుతుందన్నారు. ఇప్పటికైనా బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సత్తిబాబు డిమాండ్ చేశారు.

ఘనంగా వీరభద్రుని సంబరం



వీరభద్రుడిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

తాళ్లరేవు: పి.మల్లవరంలో వీరభద్రుని సంబరాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పంట కాలువ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముత్యాలమ్మ ఆలయం వరకు వీరభద్రుడిని డప్పు వాయిద్యాలు, నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఉంగరాల వెంకటేశ్వరరావు, విళ్ల సత్యనారాయణ, ధూళిపూడి రామకృష్ణ, శుభ, కాట్నం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సర్ సీవీ రామన్ పాఠశాలకు అవార్డు

అమలాపురం టౌన్: ఒలింపియాడ్ పరీక్షల నిర్వహణ సంస్థ సుచిరిండియా ఫౌండేషన్ స్థానిక సర్ సీవీ రామన్ పాఠశాలను ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసి అవార్డును ప్రకటించింది. ఈ నెల 16న హైదరాబద్‌లోని లలిత కళా తోరణం ఆడిటోరియంలో జరిగే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆ స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు బెస్ట్ స్కూలు అవార్డును అందుకోనున్నారు. సుచిరిండియా ఫౌండేషన్ నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షల్లో సర్ సీవీ రామన్ స్కూలు విద్యార్థులు ఎ.దానిష్ (స్టేట్ ఫస్ట్ ర్యాంక్), జి.మణికంఠ (4వ ర్యాంక్), జి.సంజన (4వ ర్యాంక్) సాధించారని స్కూలు ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

అమలాపురం రూరల్: వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన మల్టీ పర్పస్ సైక్లింగ్ మిల్లర్ ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడంతో నమూనాను తయారు చేసిన విద్యార్థులను సమనస పంచాయతీ సర్పంచ్ పరమట శ్యామ్ కుమార్, ఉప సర్పంచ్ మామిళ్లపల్లి దొరబాబు, విద్యా కమిటీ సభ్యులు పరమట భీమ మహేష్‌లు గురువారం సన్మానించారు. గైడ్ చేసిన ప్రధానోపాధ్యాయుడు గుబ్బల నాగ సత్యనారాయణ, ప్రాజెక్టు టీచర్ ప్రకాష్‌లను అభినందించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ ఎలిపే ముత్యాల బాబు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వెండి ఆభరణాల బహూకరణ

ముమ్మిడివరం: స్థానిక కృష్ణ దేవరాయ కాపు కల్యాణ మండపంలోని మహా గణపతి, సీతా సమేత రామలక్ష్మణ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివార్లకు దాతలు వెండి ఆభరణాలను బహూకరించారు. దాతలు తాడి పెద నరసింహారావు, చిన నరసింహారావు, కాశీ విశ్వేశ్వరరావులు రూ.2 లక్షలతో వీటిని సమకూర్చారు. గురువారం ఆలయ అర్చకులు సుదర్శనం శ్రీరామ చిరంజీవాచార్యులు సంప్రోక్షణ నిర్వహించి స్వామి వార్లకు అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు

ముమ్మిడివరం: ముమ్మిడివరం పెద్ద వంతెన వద్ద గల రుక్మాంబా సమేత పాండురంగ స్వామి ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

అమలాపురం రూరల్: మండలంలోని భట్లపాలెం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన దివ్యాంగుడికి చిందాడగరువు ఎంపీటీసీ సభ్యుడు మోటూరి కనకదుర్గ వెంకటేశ్వరరావు దంపతులు నిత్యావసరాలు అందించారు. ఈదరపల్లి బొంతువారిపేటలో అగ్ని ప్రమాద బాధితులకు సైతం నెలకు సరిపడే నిత్యావసరాలు అందజేశారు. అల్లవరం మండలం దేవగుప్తంలో బుంగ చిట్టిబాబు అనే దివ్యాంగుడి కుటుంబానికి నిత్యావసరాలు అందించారు.

‘మావాడే.. వదిలేయండి’

- మున్సిపల్ అధికారులకు తలనొప్పిగా మారిన నేతల సిఫార్సులు
- రాజకీయ జోక్యంతో పెరిగిపోతున్న షాపుల అద్దె బకాయిలు
- సీజ్ చేయొద్దంటూ అధికార పార్టీ నాయకుల ఒత్తిడి
- నిలిచిన రూ.89 లక్షల వసూళ్లు



అమలాపురం మున్సిపాలిటీకి చెందిన పొట్టి శ్రీరాములు షాపింగ్ కాంప్లెక్స్ (సర్క్యులర్ బజార్)

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దె వసూళ్లపై రాజకీయ జోక్యం అనివార్యమవుతోంది. ఫలితంగా మున్సిపాలిటీపై అద్దె బకాయిల భారం తడిసి మోపెడవుతోంది. అద్దె బకాయిలు రూ.లక్ష దాటిన లీజుదారుల షాపులను సీజ్ చేద్దామని మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది వెళుతుంటే ముందర కాళ్లకు బంధం అన్నట్లుగా అధికార పార్టీ నేతలు కొందరు వారికి ఫోన్లు చేసి ‘వాడు మా వాడే.. బకాయిలు త్వరలో చెల్లిస్తాడు. సీజ్ చేయడం ఆపండి’ అంటూ ఫోన్లలో సిఫార్సులు చేయడంతో ఆ ప్రయత్నాలకు బ్రేకులు పడుతున్నాయి. మరో పక్క రాజకీయ పలుకుబడితో కొందరు లీజు దారులు తమ షాపులకు డిపాజిట్లు చెల్లించకుండా చలామణి అవుతున్నారు. సాల్వెన్సీలు కట్టరు. ఇన్ని ప్రతికూల కారణాలతో మున్సిపాలిటీకి షాపుల అద్దె బకాయిలు రూ.89 లక్షల వరకూ పేరుకుపోయాయి.

మున్సిపాలిటీలో మొత్తం నాలుగు షాపింగ్ కాంప్లెక్స్‌లలో 104 షాపులు ఉన్నాయి. వీటి ద్వారా మున్సిపాలిటీకి రూ.1.08 కోట్ల ఆదాయం వస్తోంది. డిమాండ్ రూ.1.08 కోట్లకు గానూ వసూలైంది కేవలం రూ.18 లక్షలు మాత్రమే. అందులో చాలా షాపులకు కేవలం అద్దె వసూలు చేస్తున్నా డిపాజిట్, సాల్వెన్సీలు కట్టించుకున్న దాఖలాలు లేవు. అద్దెల రూపంలో రావాల్సిన ఆదాయం లక్షల మేర పేరుకు పోయిన తప్పిదం వసూలు చేసే రెవెన్యూ విభాగానిదా..? పదే పదే సిఫార్సులు చేసి అద్దె బకాయిదారుల షాపులు సీజ్ చేయకుండా అడ్డుకుంటున్న కొందరు అధికార (కూటమి) పార్టీ నేతలదా..? అనే అంశంపై మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జరిగిన బడ్జెట్ సమావేశంలో తీవ్ర చర్చకు తెర తీసింది. అటు పాలక పక్షం (వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు) ఇటు ప్రతిపక్షం (టీడీపీ, జనసేన కౌన్సిలర్లు) అద్దెల వసూళ్లపై జరుగుతున్న వైఫల్యాలను, నిర్లక్ష్యాన్ని ఎండ గడుతుంటే అధికారులు అడ కత్తెరలో పోకచెక్కలా ఇరుక్కుపోయి కొంత సేపు ఇబ్బంది పడ్డారు. చివరకు ఓ అధికారి ఉన్న వాస్తవాన్ని కౌన్సిల్ ముందు ఉంచారు. ‘ఏమి చేయమంటారు.. బకాయిలు పేరుకుపోయి ఏదైనా షాపును సీజ్ చేద్దామని వెళుతుంటే రాజకీయ నాయకులు ఫోన్లు చేసి ఆపుతున్నారు’ అంటూ ఆ అధికారి తమ గోడు వెలిబుచ్చారు.

పేర్లు బయట పడితే గుట్టు రట్టు!

ఇదే అదనుగా భావించిన పాలక పక్షం షాపుల అద్దె బకాయి దారుల పేర్లను చదవాలని పట్టుబట్టారు. పేర్లు చదివితే వారు ఏ నాయకుల అనుచరులో, అభిమానులో తేలుపోతున్నది ప్రతిపక్షం ఉద్దేశ్యం. అధికారులకు రాజకీయ నాయకులతో ఫోన్లు చేయించే కొందరు కౌన్సిలర్లు ఈ చర్చపై నోరు మెదపకపోవడం గమనార్హం. రాజకీయ నాయకుల ఒత్తిడితో తాము ముందుకు వెళ్లలేక పోతున్నామని ఆ అధికారి సమావేశంలో ధైర్యంగా చెప్పిన తీరును అక్కడే ఉన్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అభినందించారు. అయితే జరుగుతున్న లోపాలను సరిదిద్దాల్సి ఉందని ఆయన అభిప్రాయపడడం గమనార్హం.

రాజకీయ జోక్యాన్ని నిలువరిస్తూ తీర్మానం!

పేరుకు పోతున్న షాపుల అద్దె బకాయిలు, వసూలు కాకపోవడానికి గల కారణాలపై చర్చించిన కౌన్సిల్ చివరకు ఇకపై అద్దె బకాయిల వసూళ్లు, షాపుల సీజ్‌ల సమయంలో అధికారులను ఎవరూ రాజకీయ ఒత్తిళ్లకు గురి చేయరాదనే నిర్ణయానికి వచ్చారు. బుధవారం జరిగిన బడ్జెట్ సమావేశంలో పాలక, ప్రతిపక్ష సభ్యులు ఇదే అంశంపై ఏకగ్రీవంగా తీర్మానం చేయడం శుభ పరిణామమే. ఇకపై రాజకీయ సిఫార్సులతో కూడిన ఫోన్లు అధికారులకు ఉండబోవని కౌన్సిలర్లు స్పష్టం చేశారు. ఇక నుంచైనా అద్దె బకాయిల వసూళ్లే కాక షాపులపై డిపాజిట్లు, సాల్వెన్సీలు పారదర్శకంగా కట్టించుకుని కౌన్సిల్‌లో మరోసారి ఈ తరహా చర్చకు తావు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

తేజస్విని ఆదర్శంగా తీసుకోవాలి



తేజస్విని అభినందిస్తున్న పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ల ప్రతినిధులు

అమలాపురం టౌన్: బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికైన ఈదరపల్లి గ్రామానికి చెందిన కుంపట్ల పూర్ణ తేజస్విని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి సూచించారు. స్థానిక హెల్త్ అండ్ ఫిట్నెస్‌లో జిమ్ క్రీడాకారుల సమక్షంలో తేజస్వికి గురువారం జరిగిన అభినందన సభకు రాజ రాజేశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు అధ్యక్షతన జరిగిన ఈ అభినందన సభలో పలువురు వక్తలు మాట్లాడారు. మహిళలు ఉన్నత చదువులు చదివి అన్ని రంగాల్లోనూ ముందుండాలని ఆకాంక్షించారు. అనంతరం బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ పూర్ణ తేజస్వికి జ్ఞాపిక అందించి సత్కరించారు. కార్యక్రమంలో తేజస్వి తండ్రి కేఎస్‌వీ సత్యనారాయణ, కోనసీమ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ల ప్రతినిధులు ఎంవీ సముద్రం, సీహెచ్. రాజబాబు, ఎం.సుధాకర్ బాబు, మెహనాజ్, లలిత, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలంటే పండగలా భావించండి

విద్యార్థులకు డీఈఓ ఉద్బోధ



ఓడలరేవు ఉన్నత పాఠశాలలో విద్యార్థితో ముచ్చటిస్తున్న డీఈఓ సలీం బాషా

అల్లవరం: పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోను కాకుండా భయాన్ని వీడి పరీక్షలు రాయాలని జిల్లా విద్యాధికారి షేక్ సలీం బాషా అన్నారు. అల్లవరం మండలంలోని అల్లవరం, ఓడలరేవు, కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. పరీక్షలకు ఏలా సన్నద్ధం అవుతున్నదీ వారి నుంచి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులంతా నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆ దిశగా బాగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సీ, డీ గ్రేడు విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచనలు చేశారు. పరీక్షలంటే పండగలా భావించాలని సూచించారు. డీఈఓ వెంట ఎంఈఓలు కిరణ్‌బాబు, ఏడుకొండలు, ప్రధానోపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వరరావు, కేఎస్ఆర్ మూర్తి, జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు

కుళాయి కనెక్షన్ల తొలింపు



9వ వార్డు సచివాలయ పరిధిలో కుళాయి కనెక్షన్ తొలగిస్తున్న రెవెన్యూ అధికారి శ్రీలక్ష్మి, సిబ్బంది

అమలాపురం టౌన్: బకాయి పన్నుల వసూళ్లపై అమలాపురం మున్సిపల్ రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది గురువారం నుంచి స్పీడ్ పెంచారు. తాగు నీటి కుళాయి పన్నులు, ఇంటి పన్నుల బకాయిదారుల జాబితాలను తయారు చేసి వారికి రెడ్ నోటీసులు జారీ చేశారు. ఎన్ని సార్లు బకాయి పన్నుల కోసం సిబ్బంది తిరిగినా స్పందించని పన్ను బకాయిదారులను 10 మందిని గుర్తించి వారి తాగు నీటి కుళాయి కనెక్షన్లను గురువారం కట్ చేసి నీటిని బంద్ చేశారు. పట్టణంలోని 9వ వార్డు సచివాలయ పరిధిలో మున్సిపల్ రెవెన్యూ అధికారి భూపతి శ్రీలక్ష్మి తన సిబ్బందితో వెళ్లి కుళాయి కనెక్షన్లు కట్ చేశారు. కుళాయిలు కట్ చేయడంతో స్పందించిన 8 మంది పన్ను బకాయిదారులు పన్నులు పూర్తిగా చెల్లించారు. దీంతో అధికారులు వారి కుళాయిలకు రీ కనెక్షన్లు ఇచ్చి పునరుద్ధరించారు. రెడ్ నోటీసులు జారీ చేసిన బకాయిదారులను స్వయంగా కలిసి పన్నులను త్వరగా చెల్లించాలని మరోసారి సూచించారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు మాట్లాడుతూ పట్టణంలో పన్నుల బకాయిలను ఆయా ఇంటి యాజమానులు త్వరగా చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు ఆత్మ విశ్వాసమే ఆయుధం కావాలి

కోనసీమ సైన్సు పరిషత్ అధ్యక్షులు సర్వేశ్వర శర్మ



సర్వేశ్వర శర్మను సన్మానిస్తున్న బీవీసీ అధ్యాపకులు

అల్లవరం: చేసే పని ఏదైనా ఏకాగ్రత, ఆత్మ విశ్వాసం, కఠోర శ్రమ ముఖ్యమని కోనసీమ సైన్సు పరిషత్ అధ్యక్షులు సీవీ సర్వేశ్వర శర్మ అన్నారు. ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సైన్సు హ్యూమానిటీ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ మహేశ్వరరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కోనసీమ సైన్సు పరిషత్ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యం సాధించే దిశగా ఇంజినీరింగ్ విద్యార్థులు చదువుకునే సమయంలోనే కృషి చేయాలన్నారు. సైన్సు సూత్రాలను వస్తు రూపంలో మలిచి ఉపయోగ కరమైన సాధనాలను ఆవిష్కరించడమే ఇంజినీరింగ్ విద్య లక్ష్యమన్నారు. సాంకేతికత దేశ ప్రగతికి ఎంతగానో ఉపయోగ పడుతుందని, దేశాభివృద్ధిలో విద్యార్థులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ప్రతి విద్యార్థి ఏకాగ్రత, ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను సాధించుకోవాలన్నారు. అనంతరం సీవీ సర్వేశ్వర శర్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీవీసీ అధినేత బోనం కనకయ్య, శ్రీపాద రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

డీజీపీ సత్యసుందరం

యానాం: శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం కృషి చేయాలని పుదుచ్చేరి డీజీపీ(లా అండ్ ఆర్డర్) సత్యసుందరం పేర్కొన్నారు. గురువారం యానాం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీసు అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. నేరాల అదుపునకు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలతో స్నేహ సంబంధాలను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో నేరాలు, కేసుల నమోదు తదితర వాటిపై సమీక్షించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ నెల 8న ప్రజల్లో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించేలా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాల పెద్దలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి నేరాల అదుపునకు వారి నుంచి అభిప్రాయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్సై ఇలంగో, మురుగానందన్, ట్రాఫిక్ ఎస్సై నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



విద్యాశాఖ మంత్రి నమశ్శివాయంతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని పుదుచ్చేరి హోం, విద్యాశాఖ మంత్రి నమశ్శివాయాన్ని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. గురువారం ఆయన పుదుచ్చేరిలో మంత్రి నమశ్శివాయాన్ని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. యానాం విద్యాశాఖ పరిధిలో వివిధ పాఠశాలల్లో మిల్క్ బాయిలర్లుగా విధులు నిర్వహిస్తున్న మహిళల జీతాలను రూ.18 వేలు పెంచుతున్నట్లు అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్నారని ఇప్పటి వరకు వారికి జీతాలు పెంచలేదన్నారు. టీజీటీ ఉపాధ్యాయులను పర్మినెంట్ చేయాలని కోరారు. పారా టీచర్స్ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. వారి సమస్యపై త్వరలోనే కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. యానాంలో విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలలను విలీనం చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. యానాం ఏడీ వెల్ఫేర్‌లో రూ.కోటి నిధులు ఉన్నప్పటికీ కమిషనర్, ఏఈలు పనులు మొదలు పెట్టకుండా కాలయాపన చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

మహిళలు ఆర్థిక సాధికారిత సాధించాలి



విపత్తులపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

యానాం: మహిళలు స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించుకుంటూ ఆర్థిక సాధికారిత సాధించాలని ఉమా ఇండస్ట్రీస్ అధినేత పిల్లి ఉమా మహేశ్వరి పేర్కొన్నారు. గురువారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు మహిళాభివృద్ధి అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంబ్రాయిడరీ, స్వీయింగ్ పరిశ్రమ, డిజైన్‌లపై విద్యార్థులకు వివరించారు. రిలీఫ్, రిస్క్ ఆపరేషన్‌లపై యానాం అగ్నిమాపక శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు నరేష్, శ్రీనివాస్, అధ్యాపకులు తాతపూడి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

కేక్‌లో పాలథిన్ కవర్!

అవాక్కయిన వినియోగదారుడు



బేకరీ నుంచి తెచ్చిన కేక్‌లో బయటపడ్డ పాలథిన్ కవర్

అమలాపురం టౌన్: బేకరీలో కేక్ కొంటే పాలథిన్ కవర్ ఉచితం అన్నట్లుగా ఆ బేకరీలో కొన్న కేక్ లోపల నుంచి పాలథిన్ కవర్ రావడంతో వినియోగదారుడు అవాక్కయ్యాడు. స్థానిక కలెక్టరేట్ - నల్లవంతెన మధ్య రోడ్డులో గల ఓ బేకరీ షాపులో పట్టణానికి చెందిన విశ్రాంత సిపాయి, గెయిల్ సెక్యూరిటీ అధికారి అర్జున్ మంగళవారం రాత్రి ఓ కేక్ కొన్నారు. ఇంటికి తీసుకొని వెళ్లి ఈ కేక్‌ను తినేందుకు సిద్ధమవుతున్న తరుణంలో కేక్ నుంచి పాలథిన్ కవర్ బయటకు రావడంతో ఆయన కంగారు పడ్డారు. తక్షణమే అర్జున్ సదరు బేకరీ వద్దకు వెళ్లి కేక్‌లో పాలథిన్ కవర్ గురించి అడిగాడు. పొరపాటున జరిగి ఉండవచ్చని బేకరీ సిబ్బంది తేలికగా తీసుకున్నారని అర్జున్ తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అర్జున్ వాపోయారు.

సాగు, తాగునీటి ఎద్దడిపై దృష్టి పెట్టాలి



పంట పొలాలను పరిశీలిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: నియోజకవర్గ పరిధిలోని దరియాలతిప్ప తదితర ప్రాంతాల్లో సాగు, తాగునీటి ఎద్దడి ఏర్పడిందని సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలువురు రైతాంగం గురువారం ఆర్ఏఓ మునిస్వామికి విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఆయన ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. సాగునీరు అందక ఎండిపోతున్న పంట పొలాలను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. రక్షిత మంచినీటి చెరువులో పూడిక పేరుకుపోవడంతో దానిని సైతం పరిశీలించి పీడబ్ల్యూడీ అధికారులతో చర్చించారు. శివారు పొలాలకు సాగునీరు అందించేందుకు ఏపీ ఇరిగేషన్ అధికారులతో చర్చించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ, పీడబ్ల్యూడీ అధికారులు పాల్గొన్నారు.

క్యూ పాటించి దర్శనం చేసుకోవాలి



అంతర్వేది టూరిజం గెస్ట్‌హౌస్‌లో మాట్లాడుతున్న ఆర్డీవో

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో తీర్థమహోత్సవాల్లో భక్తులు క్యూ పాటించి, దైవదర్శనం చేసుకోవాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి సూచించారు. గురువారం అంతర్వేది టూరిజం గెస్ట్ హౌస్‌లో ఆర్డీవో మీడియా సమావేశం నిర్వహించారు. దర్శనం సమయంలో పిల్లలను తగు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. గుడిని పరిశుభ్రంగా చూసుకోవాలని అన్నారు. తీర్థంలో శానిటేషన్ మూడు షిఫ్టులలో కార్మికులు నిర్వహించనున్నారని తెలిపారు. భక్తుల భద్రతకు ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు భాగస్వాములవుతున్నట్టు ఆర్డీవో వెల్లడించారు. ఎండోమెంట్ డీసీ డీఎల్‌వీ రమేష్‌బాబు, ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పితానికి పలువురి పరామర్శ



పితాని మాతృమూర్తి సత్యవతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు శామ్యూల్ సాగర్ తదితరులు

తాళ్లరేవు: మాతృ వియోగంతో బాధ పడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణను గురువారం పలువురు పరామర్శించారు. ముమ్మిడివరం మండలం అనాతవరం శివారు శెట్టిపేటలోని స్వగృహంలో ఉన్న పితానిని తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దడాల జగదీశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి బొంతు మోహన్, కొపనాతి నాగరాజు, పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, నాయకులు పెయ్యల శ్రీనివాస్, రేవు నాగేశ్వరరావు, పలివెల నాగేశ్వరరావు, కేబుల్ శ్రీను తదితరులు పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు డీఎంహెచ్ఓ పరామర్శ



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న డీఎంహెచ్ఓ దుర్గారావు దొర

అమలాపురం రూరల్: అమలాపురం మండలంలోని ఈదరపల్లి బొంతువారిపేట వద్ద మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను కోనసీమ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి దుర్గారావు దొర పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు వంట పాత్రలు, దుప్పట్లు, చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దెల వెంకటేష్, కడిమి అర్జున్ పాల్గొన్నారు.

కోడి పందాల నిర్వాహకులపై కేసు నమోదు

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం శివారులో రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రంలో వారం రోజుల క్రితం కోడి పందాలు యథేచ్ఛగా నిర్వహించారు. హేచరీ నిర్వాహకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పందాలలో జిల్లా నలుమూలల నుంచి వివిధ పార్టీలకు చెందిన నేతలు హాజరయ్యారు. ఉదయం వేళ విందు ఏర్పాటు చేయగా, రాత్రి సమయంలో కోడి పందాలు, గుండాట, పేకాట నిర్వహించారు. రహస్యంగా జరిగిన ఈ కోడి పందాలు గురువారం సోషల్ మీడియా వేదికగా వైరల్ అయింది. ఈ వీడియో ఆధారంగా కోడి పందాలు, గుండాట తదితర అసాంఘిక కార్యకలాపాలపై కేసు నమోదు చేశామని ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానాలు

అమలాపురం టౌన్: పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ అయిదుగురు నిందితులను స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో గురువారం హాజరు పరచగా ఆయన ఒక్కొక్కరికీ రూ.11 వేల చొప్పున మొత్తం రూ.55 వేలు జరిమానా విధించినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

సర్పంచ్‌ను కాపాడిన బెల్లంపూడి గ్రామస్తులు



బెల్లంపూడి వద్ద కాలువలో పడిపోయిన మోటారు సైకిల్

పి.గన్నవరం: మోటార్ సైకిలుపై వస్తూ బెల్లంపూడి వద్ద గురువారం అర్ధరాత్రి ప్రమాదానికి గురై పంటకాలువలో పడిపోయిన ఎల్.గన్నవరం సర్పంచ్ పసలపూడి రామకృష్ణను స్థానికులు రక్షించారు. తీవ్రగాయాల పాలైన రామకృష్ణను తొలుత పి.గన్నవరం సీహెచ్‌సీకి, అక్కడి నుంచి రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. సర్పంచ్ రామకృష్ణ గురువారం అర్ధరాత్రి తాడేపల్లిగూడెం నుంచి ఎల్.గన్నవరంలోని ఇంటికి మోటారు సైకిలుపై బయల్దేరారు. బెల్లంపూడి ఎండీపేటకు వచ్చే సరికి ఆయనకు ఫిట్స్ వచ్చాయి. దీంతో మోటారు సైకిలు అదుపుతప్పి రోడ్డుకు ఎడమవైపున్న ఉన్న పంట కాలువలో పడిపోయింది. దీనిని గమనించిన దిగుమర్తి శ్రీను, నాగరాజు, నెలబాలుడు, ఆకుమర్తి రాములు వెంటనే కాలువలోకి దిగి తీవ్ర గాయాలపాలైన రామకృష్ణ బయటకు తీసుకువచ్చారు. ఫిట్స్ నుంచి కోలుకునేటట్టు చేసి, ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించారు. నీట మునిగిపోతున్న సర్పంచ్‌ను కాపాడిన గ్రామస్తులను పలువురు అభినందించారు.

ఓవర్ లోడింగ్ వాహనాలపై చర్యలు

రాజోలు: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణం పురస్కరించుకుని ఈనెల 7, 8 తేదీల్లో అంతర్వేది వచ్చే ప్రయాణికుల వాహనాల ఓవర్ లోడింగ్‌పై చర్యలు తీసుకుంటామని జిల్లా ఆర్టీవో దేవిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆయన రాజోలు ఆర్టీసీ డిపో మేనేజర్ ధనమ్మ, ఇతర అధికారులతో గురువారం సమావేశమయ్యారు. ఆటోలు, మ్యాక్సీ క్యాబ్ తదితర వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఉంటే వారిని అక్కడికక్కడే దించి ఆర్టీసీ బస్సుల ద్వారా అంతర్వేది తరలిస్తామన్నారు. ఓవర్ లోడింగ్‌కు పాల్పడిన వాహన యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామన్నారు.